చిందర వందరగా..

సుందరీకరణ పనులు


పాలకొండ రోడ్డులో పాత డివైడర్‌పై నిర్మించిన కాంక్రీట్ గోడ

- అస్తవ్యస్తంగా శ్రీకాకుళం నగర అభివృద్ధి పనులు
- రథసప్తమి పేరిట హడావిడిగా నిర్వహిస్తున్న వైనం
- పనుల్లో నాణ్యత లోపిస్తోందని విమర్శలు

ఎప్పుడూ లేనంత గందరగోళం.. ఏ క్షణాన ఏం కూల్చుతారో.. ఏ నిర్మాణం చేపడతారో.. ఒకే వేళ పనులు నిర్మించినా తర్వాత రోజుకు ఆ నిర్మాణాలు ఉంటాయో.. లేక కొత్తగా ప్లాన్ అంటూ కూలగొట్టి మళ్లీ పనులు చేపడతారో తెలియని పరిస్థితి. సంక్రాంతి పండగ ముందు ప్రారంభమైన ఈ హడావుడి పనులతో నగరవాసులు చిర్రెత్తిపోతున్నారు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో డే అండ్ నైట్ నుంచి వైఎస్సార్ కూడలి (ఏడురోడ్లు) వరకు, పొట్టిశ్రీరాములు పెద్దమార్కెట్ నుంచి అరసవల్లి వరకు సుందరీకరణ పేరిట పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్స్ ఏర్పాటు, పెయింటింగ్స్, ప్రధాన కూడళ్ల వద్ద శాశ్వతప్రాతిపదికన ఫౌంటెయిన్ ఏర్పాటు, అందమైన మొక్కలు వేసి గ్రీనరీ అభివృద్ధి, నగరానికి వచ్చే ప్రధాన


పాత డివైడర్‌పై కొత్తగా గజాలు వేస్తున్న దృశ్యం

ముఖద్వారాల ఆధునీకరణ వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులన్నీ చేసేందుకు మున్సిపాలిటీ నుంచి సుమారు రూ.4కోట్లు, సుడా నుంచి రూ.40లక్షలకు పైగా వెచ్చించి షార్ట్‌టైం టెండర్లు పిలిచి పనులు చేస్తున్నారు. అయితే హడావిడిగా పనులు చేయడంతో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, ఇంజినీర్ల పర్యవేక్షణ లేకుండా పనులు జరుగుతున్నాయని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. డే అండ్ నైట్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఉన్న చెట్లు తొలగించి.. పాత డివైడర్లకు కొత్త గజాలు లింక్ చేసి 2.50 అడుగులకంటే ఎత్తుగా నిర్మాణాలు చేస్తున్నారు. దీనికి సుమారు రూ.90లక్షలకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులే చెబుతున్నారు. వాస్తవానికి కింద ఉండే బేస్‌మెంట్ అంత గట్టిగా లేదు. దానిపై కొత్త డివైడర్లు నిర్మించడం వల్ల తొందరగా కూలిపోయే ప్రమాదముంటుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. శాశ్వతప్రాతిపదికన ఉండాలంటే భూమిలోపల నుంచి పునాదులు తీసి దీనికి గజాలు లింక్‌చేసి కాంక్రీట్‌వాల్స్ నిర్మించాల్సి ఉంటుంది.

☛ అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేసిన చోట వద్ద కాంక్రీట్‌వాల్ నిర్మించారు. వెంటనే కూలగొట్టారు. మళ్లీ కట్టారు. అరసవల్లి ప్రాంతంలో కూడా కాలువల నిర్మాణం వంటివి చేస్తున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అసలు ఇటువంటి పనులన్నీ చేసేందుకు రెండు మూడు నెలలు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అవేమీ లేకుండా హడావిడి పనులు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ పనిచేసినట్లు చూపించి 'కలిసికట్టు'గా నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

పర్యవేక్షణలోనే పనులు..



నిరంతరం పనులు పర్యవేక్షిస్తున్నాం. ఇంజినీరింగ్ సిబ్బంది పనుల వద్దే ఉంటున్నారు. ఎక్కడైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగినా వెంటనే వాటిని సరిచేస్తున్నాం. రథసప్తమి నాటికి పనులు పూర్తిచేయాలన్నదే మా లక్ష్యం. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పనులన్నీ సకాలంలో పూర్తిచేస్తాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం


పాలకొండ రోడ్డులో పాత డివైడర్‌పై ఏర్పాటుచేసిన గజాలు

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


విరాళమిస్తున్న గౌరమ్మ కుటుంబసభ్యులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన పాలిశెట్టి గౌరమ్మ రూ.1,01,000 విరాళంగా అందజేశారు. గురువారం ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకు విరాళం అందజేశారు. రూ.లక్షకు మించి విరాళాలను ఇచ్చిన దాతలకు డోనర్ పాసులు అందజేస్తున్నట్లు కనకరాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత


పనులు అడ్డుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో రామతీర్థాలు కూడలి వద్ద హైస్కూల్ పక్కన అక్రమంగా రోడ్డును ఆక్రమించుకుని చేపడుతున్న పక్కా భవన నిర్మాణాన్ని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అడ్డుకున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ స్థలాన్ని పరిశీలించి పనులు నిలుపుదల చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో సదరు వ్యక్తులు పనులు ఆపేశారు.

ఉత్తమ నాటికగా 'మతమా.. మానవత్వమా'


బహుమతులతో లలితశ్రీ కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఖరగ్‌పూర్‌లో ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన నాటిక పోటీల్లో శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి ప్రదర్శించిన 'మతమా.. మానవత్వమా' నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించిందని నటుడు, దర్శకుడు రామలింగస్వామితెలిపారు. ఉత్తమ దర్శకుడిగా ఎల్.రామలింగస్వామి, ఉత్తమ నటుడిగా రేజేటి బోసుబాబు, ఉత్తమ నటిగా రాజేశ్వరిలు సినీ నటుడు నాగినీడు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు వివరించారు.

రాజ్యాధికారమే లక్ష్యం


బీఎస్పీ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే కె.రాజారావు అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో శ్రీకాకుళం నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు. ఇన్‌చార్జిగా గుజ్జల సూర్యనారాయణ(ప్రభాస్ సూర్య), కన్వీనర్-1గా గుజ్జల అప్పారావు, కన్వీనర్- 2గా గొటివాడ మణి, అధ్యక్షుడిగా ఆకుల అప్పలసూరి, ఉపాధ్యక్షుడిగా రెల్ల దయానిధి, ప్రధాన కార్యదర్శిగా లింగాల యుగంధర్, కోశాధికారిగా ఎస్.దాలిబాలు, మీడియా ఇన్‌చార్జిగా రొతు సూర్యనారాయణలను నియమించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గరికవాడు, రాకోటి చిన్నారావు, యువత పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి


పనులు పరిశీలిస్తున్న డీఈఈ శ్రీరాములు

జి.సిగడాం: రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఎస్.శ్రీరాములు అన్నారు. గురువారం జి.సిగడాం బీసీ కాలనీ, మెయిన్ రోడ్డు, చెట్టుపొదిలాం, పాలఖండ్యాంపరిధిలో జరుగుతున్న రహదారి పనులను పరిశీలించారు. ఈయనతోపాటు సర్పంచ్ ముద్దాడ గౌరీ, ఎం.చిన్నారావు, శిరిగిడి గోవిందరావు, హరి, వెలిది బాబా, పంచాయితీ కార్యదర్శి సాహు, రాము ఉన్నారు.

ఆకట్టుకున్న జేసుదాసు గానలహరి

శ్రీకాకుళం కల్చరల్: ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ ఆధ్వర్యంలో సోడవరం హేమలత జ్ఞాపకార్థం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి, జేసుదాసు జన్మదినం సందర్భంగా గానలహరి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జేసుదాసు గీతాలను ఆలపించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు, నిర్వాహకులు సోడవరం ఈశ్వర్, మణిశర్మ, శంకరరావు, కౌముది ప్రిన్సిపాల్ పి.వనజాక్షి, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, లీలారాణి, శ్రీను, భాస్కర్, మురళీధర్‌రావు, రాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు


రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద కాంగ్రెస్ నాయకులు రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న దుర్మార్గపు చర్యలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి రాంప్రసాద్, అనుపోజు రవికుమార్, శోడవరం చంద్రశేఖర్, చోడవరం లీలావతి, సూర్య బేగం పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరం మహాత్మజ్యోతిభాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో బి.లహరి ప్రథమ, వ్యాసరచన పోటీల్లో ఎం.పూజ ప్రథమ, నృత్యప్రదర్శన పోటీల్లో యు.హాసిని ప్రథమ, పాటల పోటీల్లో సీహెచ్ కీర్తిప్రియ తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు, ప్రసంశాపత్రాలను ఎమ్మెల్యే గొండు శంకర్, చేతులమీదుగా అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది గురువారం అభినందించారు.

బాలల రక్షణకు ప్రాధాన్యం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

రణస్థలం: బాలబాలికలకు బంగారు భవిష్యత్ దక్కాలంటే చక్కని చదువు అందించాలని జిల్లా కార్మిక అధికారి ఆర్.వి.శ్రీనివాసరావు తెలిపారు. రణస్థలంలోని పలు వాణిజ్య దుకాణాల వద్ద చైల్డ్ హెల్ప్‌లైన్, జిల్లా బాలల రక్షణ విభాగం, విద్యాశాఖ అధికారులు గురువారం బాలల చట్టాలు, రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నట్లు ఎక్కడ కనిపించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎ.త్రినాథరావు, ఏఐఎస్‌వో ఎం.జనార్దన్‌రావు, కానిస్టేబుల్ రుద్రయ్య, బాలల రక్షణ విభాగం ఔట్‌రీచ్ వర్కర్ ఎ.గీత, చైల్డ్‌లైన్ సిబ్బంది మౌనిక, తేజ, సీఆర్‌పీ యు.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఆర్.పాపినాయుడు, యుగంధర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో గురువారం జరిగిన ఈ ఎంపికలకు 40 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపికైన క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు శిక్షణ శిబిరాలను నిర్వహించి తుది జట్లను ఖరారు చేస్తామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, బి.సోములు, జి.కొర్లయ్య, పి.సంతోష్, మురళి, అరుణ్‌కుమార్, రాజం పీడీ స్వాతి పాల్గొన్నారు.

బోస్ పోరాటం చిరస్మరణీయం


శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరం ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో నేతాజీకి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి


శ్రీకాకుళం అర్బన్: సమరయోధుల స్మృతివనంలో బోస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

భారత స్వాతంత్య్ర పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపించిన తెగువ ప్రపంచ దేశాల్లో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. బోస్ 128వ జయంతి వేడుకలు శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్

కుమారరాజుకు పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలో శ్రీశ్రీ కళావేదిక, రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయిట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి బుర్రి కుమారరాజుకు తెలుగు కీర్తి జాతీయ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా కుమారరాజును పలువురు కవులు, రచయితలు అభినందించారు.

నైపుణ్య శిక్షణకు రిజిస్ట్రేషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: నైపుణ్య శిక్షణ, ఉపాధి(పీఎం ఇంటర్న్‌షిప్) కోసం ఎచ్చెర్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో సీపాన హరిహరరావు చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 నుంచి 24 ఏళ్ల యువత ఈ నెల 26లోపు రిజిస్ట్రేషన్ చేసుకుంటే నైపుణ్య శిక్షణ, అనంతరం ఉపాధి కల్పిస్తామని వివరించారు.

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న పీఎం ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం గ్రామీణ, రెండో పట్టణ, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 41 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. పెద్దగా శబ్దాలు చేసే వాహనాలు ఐదింటిని సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ప్రకటన విడుదల చేశారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల: లావేరు మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను శ్రీకాకుళం నుంచి విజయవాడ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో సుభద్రాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, చంద్రమౌళికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆ బస్సులోనే రణస్థలంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీలో జగిలింకి రమేష్, చిల్లపేటరాజం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుర్ల రమణ ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, సర్పంచ్ కంబపు నరసింహులు రెడ్డి, ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, నాయకులు ఆళ్ల రాంభూపతి రెడ్డి, కొంతాల లక్ష్మణ రెడ్డి, గురాన చిరంజీవి, పిన్నింటి సత్యంనాయుడు, గోవిందాసు సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని ఆలయ హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. స్థానిక ఆలయ అనివెట్టి మండపంలో ఈమేరకు ప్రత్యేక బందోబస్తు నడుమ ఈ లెక్కింపును నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

పొంచి ఉన్న ప్రమాదం



శ్రీకాకుళం నగరంలో పాలకొండ రోడ్డు నుంచి రిమ్స్ ఆస్పత్రికి వచ్చే ప్రవేశమార్గంలో పెద్ద కాలువపై పలక పాడైపోయింది. దీంతో చిన్నారులు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు స్థానికులే స్పందించి కాలువపై ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసుకున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పోటీతత్వంతోనే విజయం



విద్యార్థులకు పోటీ పరీక్షలు ఎంతో అవసరమని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ షోయాబ్ ఆలం అన్నారు. గురువారం కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా పే చర్చా విభాగంతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం స్వాతంత్ర్య సమయోధుల జీవిత విశేషాలపై పరీక్ష నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– శ్రీకాకుళం రూరల్

ఆదిత్యుని సన్నిధిలో



అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ మువ్వ పద్మ గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను, త్వరలో జరుగునున్న రథసప్తమి మహోత్సవ ప్రాముఖ్యతను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వివరించారు.

– అరసవల్లి

నాక్ బృందం పరిశీలన


కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న నాక్ బృందం సభ్యులు, ఎమ్మెల్యే

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలను నేషనల్ అక్రిడేషన్ కమిటీ (నాక్) బృందం గురువారం పరిశీలించింది. బెంగళూరుకు చెందిన నేక్ కమిటీ సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను, పరిసరాలను, ఎన్‌సీసీ భవనాన్ని, ఎన్ఎస్ఎస్ భవనాన్ని, కళాశాల మైదానాన్ని, నిర్మితమౌతున్న కొత్త భవనాల పనులను పరిశీలించారు. ఏర్పాట్లు, వసతులు, సౌకర్యాల కల్పన పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తంచేశారు. కాగా, ప్రతిష్ట కలిగిన శ్రీకాకుళం జీసీడీ మెన్ కళాశాల అభివృద్ధి చెందాలంటే మరికొన్ని అదనపు భవనాలు కేటాయించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నాక్ బృందం సభ్యులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, విద్యావేత్త సురంగి మోహన్‌రావు, రిటైర్డ్ సెట్ సీఈవో వీవీఆర్ఎస్ మూర్తి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: యోగా, ధ్యానంతో ఒత్తిడికి దూరంగా ఉండవచ్చని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ అన్నారు. క్యాంపస్‌లో గురువారం యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు డాక్టర్ బగాది పాపారావు మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. ఉదయాన్నే సూర్య నమస్కారాలు, ఆసనాలు వేయాలన్నారు. వ్యాయామం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


పరిశీలిస్తున్న సీఐ అవతారం, ఎస్సై చిరంజీవి

రణస్థలం: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం ఆటో డ్రైవర్లు, వ్యాపారులకు ఆదేశించారు. జె.ఆర్.పురంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువ కావడంతో ఎస్సై ఎస్.చిరంజీవి, పంచాయతీ అధికారుల సమక్షంలో గురువారం మండల కేంద్రంలో పర్యటించి పలు సూచనలు చేశారు.

పాత పోలీస్ స్టేషన్ వద్ద బస్సులు నిలపకుండా, బస్–బే వద్ద మాత్రమే నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టారు. వాణిజ్య దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య కలుగుతోందన్నారు. ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలని ఆదేశించారు. పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథరావు మృతి తీరని లోటు


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న శిష్టకరణ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలకొండకు చెందిన విశ్రాంత పర్యవేక్షక ఇంజినీర్ ఇప్పిలి జగన్నాథరావు మృతి శిష్టకరణ జాతికి తీరని లోటని రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని మహలక్ష్మి నగర్‌కాలనీలో శిష్టకరణ సామాజిక భవనంలో గురువారం జగన్నాథరావు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణాల అభ్యున్నతికి అవిరళ కృషిచేసిన గొప్ప వ్యక్తి జగన్నాథరావు అని కొనియాడారు. అనంతరం ఫ్రెండ్స్ ఆఫ్ ద ఎర్త్ ఆర్గనైజేషన్ అధినేత డాక్టర్ బి.శ్రీనివాస్ పట్నాయక్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరికతోట కనకరాజు, ఎస్‌వీడీ మురళి, జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు, ఆర్.వి.ఎస్.శర్మ, సదాశివుని కృష్ణ, ప్రభాకరరావు, ఎం.వి.జె మోహనరావు, వెంకటరావు, గాయత్రి, సుధాకర్, చిట్టిదాస్, బి.వి.ఆర్ మూర్తి, ఉరిటి కిరణ్, డబ్బీరు వెంకటరమణమూర్తి, పొన్నాడ మోహనరావు, పి.జగన్మోహనరావు, నారాయణ, రామచంద్రరావు పాల్గొన్నారు.